సాక్షి కామారెడ్డి

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



ప్రజా సంక్షేమానికి కృషి

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



కేసీఆర్ ఘనతే..

గ్రామాల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పేర్కొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /18.6

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

15 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి తూర్పు హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీశారద, ఆదిశంకర ఆలయంలో ఈనెల 15న శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 15 నుంచి 23వ తేదీ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ ఉదయం 5.30 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారికి నిత్య హోమం, అర్చన, అభిషేకాదులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు ఆయా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి




ఎల్లారెడ్డిరూరల్: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం కనీసం రూ.26వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లారెడ్డిలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో మున్సిపల్ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వారు సమ్మె చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు వెంకన్న, వేణు, మహేందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో విదేశీ విద్యార్థుల పర్యటన



తాడ్వాయి: మండలంలో ఆదివారం విదేశీ విద్యార్థులు పర్యటించారు. ఫ్రాన్స్‌లోని ఎస్టీ గాబ్రియెల్ కాలేజీకి చెందిన దాదాపు 40 మంది విద్యార్థులు కల్చరల్ ఎక్స్ఛేంజ్, భారత్ దేశ సంప్రదాయాలు తెలుసుకోవడానికి తాడ్వాయి పోలీస్‌స్టేషన్, మండలంలోని చిట్యాల, సంతాయిపేట్ గ్రామాలను సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగే రోజువారీ కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. ఎస్సై ఆంజనేయులు వారికి వివరించారు. అనంతరం చిట్యాల గ్రామానికి వెళ్లి చిన్నారులతో ఆడి పాడి వనభోజనాలు చేశారు. వారి వెంట ఎస్సై ఆంజనేయులు, సర్పంచ్ కవిత, గ్రామ పెద్దలు ఉన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా



రెంజల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు డీసీపీ జయరాజ్ పేర్కొన్నారు. మండలంలోని కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆదివారం సందర్శించారు. సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా పరిధిలోని గోదావరి వంతెన అవతలి పక్కన అక్కడి పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. పోలీసులతో పాటు అటవీ, ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖలు 24 గంటలు అప్రమత్తంగా ఉంటారన్నారు.


చర్మకారులకు ఉపాధి కల్పించడంలో విఫలం

ఆర్మూర్: పాలకుల చిత్తశుద్ధి లేమితో ఆర్మూర్‌లోని మినీ లెదర్ పార్క్ నిరుపయోగంగా మారిందని, చర్మకారులకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ ఆరోపించారు. పట్టణ శివారులోని యానం గుట్ట వద్ద 20 ఏళ్ల క్రితం నిర్మించిన లెదర్ పార్క్‌ను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో నిధులు మంజూరైనా సమన్వయ లోపంతో పథకం పనులు ముందుకు సాగలేదన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్నాక కూడా పరిస్థితి అలాగే ఉందన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి చిత్తశుద్ధి లేమితోనే లెదర్ పార్క్ నిరుపయోగంగా మారిందన్నారు. చెన్నైలో శిక్షణ పొందిన చర్మకారులు ప్రస్తుతం రోడ్లపై చెప్పులు కుట్టుకుంటూ దయనీయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లెదర్ పార్క్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

తగ్గేదేలే..

సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు శనివారం కామారెడ్డిలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రత్యర్థులపై చేసిన విమర్శలకు వారి నుంచి అదే స్థాయిలో ప్రతిస్పందన వచ్చింది. సీఎం కేసీఆర్‌ను ఓడించి కామారెడ్డి ప్రజలు కొత్త చరిత్ర రాస్తారని పేర్కొంటున్నారు.

- బరిగీసి కొట్లాడుతామంటున్న కేసీఆర్ ప్రత్యర్థులు
- బీఆర్‌ఎస్‌కు సవాల్ విసురుతున్న షబ్బీర్ అలీ, వెంకటరమణారెడ్డి
- సీఎంను ఓడించి తీరుతామంటూ ప్రకటనలు
- మంత్రి కేటీఆర్ విమర్శలపై దీటుగా ఎదురుదాడి



సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి నియోజకవర్గంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇక్కడ అధికార పార్టీ అభ్యర్థిగా సీఎం పేరును ప్రకటించగా.. కాంగ్రెస్‌నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి నిలవడం దాదాపు ఖాయమైంది. ముగ్గురూ బలమైన నేతలే కావడంతో అందరి దృష్టి కామారెడ్డిపైనే కేంద్రీకృతమైంది. గజ్వేల్ అభివృద్ధి నమూనాగా కామారెడ్డిని ప్రగతి పథంలో నడిపిస్తామని అధికార పార్టీ నేతలు చెబుతుండగా.. అక్కడ అభివృద్ధి ఏమోగానీ వేలాది కుటుంబాలను రోడ్డున వడేశారని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపిస్తానంటూ బీజేపీ నేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి చలో గజ్వేల్ కార్యక్రమానికి పిలుపునివ్వగా.. కార్యక్రమానికి ఒకరోజు ముందే పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. బీజేపీ శ్రేణులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి చలో గజ్వేల్ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. బీజేపీ రాష్ట్రస్థాయి నేతలు రంగంలోకి దిగడంతో పోలీసులు ఆయనను విడుదల చేశారు. అదే రోజు రాత్రి బీజేపీ నేతలు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి, అందరి దృష్టిని ఆకర్షించారు. కాగా కాంగ్రెస్ పార్టీ నేత షబ్బీర్‌అలీ ఇటీవల వాహనాల్లో గజ్వేల్‌కు తరలివెళ్లారు. అక్కడ జరిగిన అభివృద్ధి ఏమిటన్న దానిపై అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఇలా కేసీఆర్ ప్రత్యర్థులిద్దరూ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ఇద్దరు నేతలు నిత్యం జనంలో తిరుగుతూ ప్రజలతో మమేకమవుతున్నారు. గెలుపుపై ఎవరి ధీమాలో వారున్నారు.

ఎదురుదాడి..

మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలపై అటు షబ్బీర్ అలీ, ఇటు వెంకటరమణారెడ్డి ఎదురుదాడికి దిగారు. పార్టీ కార్యక్రమాలకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఆరోపించారు. అవినీతిలో కూరుకుపోయిన వాళ్లు అవినీతి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కమీషన్లపై కక్కుర్తితో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నాసిరకంగా నిర్మించారని ఆరోపించారు. దళితబంధు పథకంలో అధికార పార్టీ నేతలు రూ. మూడు లక్షల చొప్పున కమీషన్లు దండుకుంటున్నారని విమర్శలు గుప్పించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్‌ఎస్ కలిసి పోటీ చేశాయని, అయితే పొత్తు ధర్మాన్ని విస్మరించి టీఆర్‌ఎస్ నాయకుడికి బీఫామ్ ఇచ్చి తనను ఓడించే కుట్ర చేశారని ఆరోపించారు.

మంత్రి విమర్శలపై బీజేపీ నేత వెంకటరమణారెడ్డి కూడా ఘాటుగానే స్పందించారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను ఓడించి తీరుతానన్నారు. సీఎం గజ్వేల్‌ను పూర్తిగా వదిలేసి కామారెడ్డిలో మాత్రమే పోటీ చేయాలని సవాల్ విసిరారు. కేసీఆర్‌ను ఓడించకుంటే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రకటించారు. బీఆర్‌ఎస్ సభా వేదికపై ఉద్యమకారుడొక్కరూ లేరన్నారు. మంత్రి కేటీఆర్‌కు తన పేరు ఉచ్చరించడం కూడా రాలేదని, ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి జీవితంలో మరిచిపోలేని దెబ్బకొడతానని పేర్కొన్నారు. ఇలా కేటీఆర్ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం.. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఎదురు దాడికి దిగడంతో కామారెడ్డిలో రాజకీయ వేడి పెరిగింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశాలున్నాయి.

కేటీఆర్ విమర్శలు..

కామారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కేటీఆర్.. ప్రత్యర్థి పార్టీల నేతలను టార్గెట్ చేశారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా షబ్బీర్ అలీ పోటీ చేయగా, మిత్ర ధర్మంతో మద్దతు ఇచ్చి గెలిపించామని పేర్కొన్నారు. అలాంటి షబ్బీర్ అలీ సీఎం కేసీఆర్ మీద ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఎన్నికల్లో డిపాజిట్టు కూడా రాకుండా ఓడించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే బీజేపీ నేత వెంకటరమణారెడ్డిపైనా ఆయన విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పేరు ప్రకటించగానే పోటీ నుంచి తప్పుకుని ఇంట్లో పండుకుంటానన్నాడన్నారు. కేసీఆర్ మీద పోటీ చేయడమంటే పోచమ్మ ముందు పొట్టేలును కట్టేసినట్టేనని పేర్కొన్నారు. రెండు పార్టీలకు డిపాజిట్టు కూడా రాకుండా దిమ్మ తిరిగే దెబ్బకొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

బంజారాల సంక్షేమానికి ప్రాధాన్యత



బంజారా భవన్‌కు భూమిపూజ చేస్తున్న స్పీకర్ పోచారం, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- కామారెడ్డిలో బంజారా భవన్‌కు భూమిపూజ

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం బంజారాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిర్మించనున్న జిల్లా బంజారా భవన్‌కు ఆదివారం భూమిపూజ చేశారు. పొరాదేవి పీఠాధిపతి, గిరిజనుల ఆరాధ్య గురువు రామారావు మహరాజ్ మనవడు బాబు సింగ్ మహరాజ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ఎకరం స్థలంలో జిల్లా బంజారా భవన్, జగదాంబ, సేవాలాల్, రామారావు మహరాజ్‌ల మందిరాలను నిర్మిస్తామన్నారు. నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం త్వరలోనే ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాల్లో పూజలు చేస్తున్న మహరాజ్‌లకు ధూపదీప నైవేద్యం పథకం కింద వేతనాలు ఇస్తున్నామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని తాండాల్లో జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లాలో పోడు భూముల సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటికే 5,013 మంది గిరిజనులకు 11,365 ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చామన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, బంజారా సంఘం ప్రతినిధులు బద్యానాయక్, మోహన్ నాయక్, బల్‌రాం నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రైతు బాంధవుడు



సుభాష్‌నగర్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని, ఆయన రైతు బాంధవుడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పసుపుబోర్డు కోసం 12 ఏళ్ల కాళ్లకు చెప్పులు వేసుకోకుండా తిరిగిన ముత్యాల మనోహర్‌రెడ్డి కాళ్లను పాలతో కడిగి సన్మానించారు. ఈ సందర్భంగా యెండల మాట్లాడుతూ పసుపుబోర్డు కోసం ఈ ప్రాంత రైతుల ఆకాంక్షలను మోసిన ముత్యాల మనోహర్‌రెడ్డి ఆదిలాబాద్ నుంచి తిరుపతి వరకు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాటం, ఎంపీ అర్వింద్ వినతిని ప్రధాని స్వీకరించి తెలంగాణలో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్, నాయకులు యెండల సుధాకర్, సురేష్, రాథోడ్, హరిప్రసాద్, శ్రావణ్, రాజు, మారుతి, చంద్రకాంత్, గిరిబాబు, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం..



బీబీపేట: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, పల్లె దవాఖానాలు, సంఘ భవనాలు, ఆలయాలకు నిధులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించామన్నారు. కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయన్నారు. దళితుల అభ్యున్నతి కోసం దేశంలోనే మొదటిసారిగా ముఖ్యంత్రి కేసీఆర్ దళిత బంధును ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ఎంపీపీ బాలమణి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు కోసం నిరసన



బీబీపేట: అర్హులకు కాకుండా అనర్హులకే దళిత బంధు ఇస్తున్నారని తుజాల్‌పూర్, శేరిబీబీపేట గ్రామాలకు చెందిన దళితులు ఆరోపించారు. ఆదివారం శేరిబీబీపేట గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కాన్వాయ్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దళిత బంధు పథకాన్ని కేవలం బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చారని ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులకు, దళితులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మాటామాటా పెరగడంతో ఇరుపక్షాలవారు కొట్టుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకొని, ఆందోళన చేస్తున్న దళితులను లాక్కెళ్లారు. ముగ్గురిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కేసీఆర్‌ను ప్రజాబలంతో ఓడిస్తాం

- ఓడిపోతే రాజకీయ సన్యాసానికి సిద్ధమా?
- కేసీఆర్, కేటీఆర్‌లకు బీజేపీ నేత వెంకటరమణారెడ్డి సవాల్



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాబలంతో సీఎం కేసీఆర్‌ను ఓడిస్తానని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ తాను ఓడిపోతే రాజకీయాలు మానుకుంటానన్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోతే రాజకీయ సన్యాసం స్వీకరించడానికి కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా అని సవాల్ చేశారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ వెనకడుగు వేయకుండా గజ్వేల్‌ను వదిలేసి ఒక్క కామారెడ్డిలోనే పోటీ చేయాలన్నారు. కామారెడ్డికి కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లు ఎంతమంది వచ్చినా ఎదుర్కొంటానన్నారు. కేసీఆర్ గజ్వేల్‌లో చేసిందేమీ లేదని, తాను చేపట్టిన చలో గజ్వేల్ కార్యక్రమాన్ని అడ్డుకున్ననాడే ఇది స్పష్టమైందని పేర్కొన్నారు.

వైఎస్సార్ అలా.. కేటీఆర్ ఇలా..

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కామారెడ్డిలో నిర్వహించిన సభలో నిరసన తెలపడానికి డీఎస్సీ అభ్యర్థులు వచ్చారని, వారిని వైఎస్సార్ వేదికపైకి పిలిపించి మాట్లాడారని వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కానీ కేటీఆర్ సభలో నిరసన తెలపడానికి వచ్చిన బీడీ కార్మికులపై దాడులు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌ది అన్నారు. కేసీఆర్‌పై పోటీ చేయడంకంటే మానేయడం మేలని తాను అన్నట్లు తప్పుడు వార్త రాసిన వారికి లీగల్ నోటీసులు పంపానన్నారు. ఆ పత్రిక యాజమాన్యం భయపడి రాత్రి 10 గంటలకు తన ఇంటికి వచ్చి క్షమాపణలు చెప్పింది నిజం కాదా అని ప్రశ్నించారు. తాను ఎల్లకాలం ప్రజాసేవలోనే ఉంటానని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు విపుల్, శ్రీకాంత్, భరత్, శ్రీనివాస్, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దోచుకోవడానికే వస్తున్నారు..

సిరిసిల్లలో ఇసుక, చేనేత, ల్యాండ్ తదితర మాఫియాలతో దోచుకున్నట్లు కామారెడ్డిలో దోచుకోవాలని మంత్రి కేటీఆర్ చూస్తున్నాడని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఇక్కడ నవగ్రహాలు దోచుకుంటున్నది సరిపోవడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ కామారెడ్డినుంచి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమైతే.. ఎందుకు ఒక్కొక్క ఓటును కూడబెట్టడానికి కార్యకర్తలు కష్టపడాలని వేడుకుంటున్నారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేసీఆర్ గజ్వేల్, సిద్దిపేటలను వదిలేయడం అక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని, కామారెడ్డికి వస్తుండడం ఇక్కడి ప్రజల దురదృష్టమని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో గంప గోవర్ధన్ అభివృద్ధి చేయలేదని, ఇక కేసీఆర్ చేస్తాడని సంకేతాలు ఇచ్చారన్నారు. కేటీఆర్ సభలో ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు విలువ ఇవ్వలేదన్నారు. కామారెడ్డి మెడికల్ కాలేజీలో కేటీఆర్ మేనబావకు చెందిన ఓ ఏజెన్సీతో దోపిడీ ప్రారంభించారన్నారు.

ఎలమందల ఎదురుచూపులు

- రెండోవిడత గొర్రెల పంపిణీపై స్పష్టత కరువు
- ఏళ్లుగా నిరీక్షిస్తున్న గొల్లకుర్మలు



గొర్రెలు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

నిజాంసాగర్: గొల్ల, కుర్మల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏళ్లు గడుస్తున్నాయే కానీ యూనిట్లు మాత్రం మంజూరు కావడం లేదని గొల్లకుర్మలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొదటి దఫాలో 10,796 యూనిట్లను పంపిణీ చేశారు. మొదటి దఫాలో లబ్ధిదారులు ఒక్కో యూనిట్‌కు రూ. 31,750 చొప్పున డీడీలు చెల్లించారు. డీడీలు చెల్లించినవారికి ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక గొర్రె పొట్టేలు అందించారు. రెండో దఫాలో 6,066 యూనిట్లు అందించాల్సి ఉంది. రెండో విడతలో యూనిట్ కాస్ట్ పెరగడంతో ఒక్కో యూనిట్‌కు రూ. 43,750 చొప్పున డీడీలు స్వీకరించారు. కానీ 474 యూనిట్లు మాత్రమే పంపిణీ చేశారు. మిగిలినవారు యూనిట్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. డీడీలు చెల్లించి నెలలు గడుస్తున్నా గొర్రెలు పంపిణీ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కోడ్ రాకముందే గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పంపిణీ చేయాలి



గొర్రెల మంద కోసం డీడీ కట్టి నెలలు గడుస్తున్నాయి. గొర్రెలు మాత్రం ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి ఎలక్షన్ కోడ్ రాకముందే యూనిట్లు మంజూరు చేయాలి.

– గొల్ల పవన్ యాదవ్, నర్వ

సైనికుడా సెల్యూట్..

- అశేష జనవాహిని మధ్య ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ అంత్యక్రియలు
- నివాళులర్పించిన కలెక్టర్, సీపీ
- ఆర్మీ అధికారులకు జవాన్ సతీమణి సెల్యూట్



జవాన్ గంగాప్రసాద్ మృతదేహం వద్ద ఆర్మీ అధికారులకు సెల్యూట్ చేస్తున్న మృతుడి సతీమణి

బోధన్: సిక్కిం వరదల్లో ఐదు రోజుల క్రితం గల్లంతై మృతిచెందిన బోధన్ మండలంలోని కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ అంత్యక్రియలను ఆదివారం స్వగ్రామంలో నిర్వహించారు. గల్లంతైన ఆర్మీ జవాన్ గంగా ప్రసాద్ మృతదేహం గురువారం లభ్యం కాగా శుక్రవారం పోస్టుమార్టం పూర్తి చేసి శనివారం విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. ఆదివారం హైదరాబాద్ ఆర్మీ క్యాంప్ నుంచి వారి వాహనంలో ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఉదయం బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లి నుంచి రాజకీయ నాయకులు, ప్రజలు భారీ ర్యాలీ తీశారు. లాంఛనాల ప్రకారం ఆర్మీ అధికారులు జవాన్ పార్థివ దేహానికి పుష్పగుచ్ఛం సమర్పించి గౌరవ వందనం చేయగా, జవాన్ సతీమణి శిరీష అధికారులకు సెల్యూట్ చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ, అదనపు డీసీపీ జయరాం, ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్డీవో రాజాగౌడ్, రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, తహసీల్దార్ మమత, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖఅధికారి రమేశ్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం సమర్పించి సెల్యూట్ చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్స్

డిచ్‌పల్లి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో తక్షణ ప్రవేశాల (స్పాట్ అడ్మిషన్స్)కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. బీఏ (హెచ్‌ఈపీ), బీకాం (కంప్యూటర్స్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్, బీజెడ్‌సీ), బీఎస్సీ (ఫిజికల్ సైన్స్, ఎంపీసీ, ఎంపీసీఎస్) కోర్సుల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు 9177563723, 9705336530 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నాటుసారా కేంద్రంపై దాడులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని రాజమ్మ తండాలో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు ఆదివారం దాడులు చేసి నాటుసారాను ధ్వంసం చేశారు. కామారెడ్డి ఎక్సైజ్ ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం .. తండాలోని గంగవత్ గోపాల్ ఇంట్లో ఆరు లీటర్ల నాటు సారా లభించిందని, నిందితుడిపై కేసు నమోదు చేసి నాటు సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో రామారెడ్డి ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

'రిజర్వేషన్ అమలు విధానం మార్చాలి'

తెయూ(డిచ్‌పల్లి): దేశంలో, రాష్ట్రంలో అమలవుతున్న రిజర్వేషన్ల అమలు విధానాన్ని మార్చాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. తెయూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రిజర్వేషన్ల అమలు విధానంపై ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతమున్న బీసీ రిజర్వేషన్లను 27 శాతాన్ని 60శాతానికి పెంచాలని అప్పుడే వారికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో బీసీలకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. జనాభా ప్రతిపాదికన బీసీ రిజర్వేషన్లు పెంచితే వారికి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు శివ, సూర్య, సాయిపవన్, కృష్ణ, శ్రీకాంత్, రాంచందర్, శివకుమార్, నరేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ధనం వృథా..



బోధన్‌టౌన్(బోధన్): రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలోని గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజాధనం వృథా అవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో పట్టణంలోని శక్కర్‌నగర్, రాకాసీపేట్ రైల్వే స్టేషన్ల పరిధిలోని ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొనేవి. స్పందించిన గత మున్సిపల్ పాలకవర్గం రైల్వే గేట్ సమీపంలో రూ. 17 లక్షలు వెచ్చించి రైల్వే స్టేషన్‌ను నిర్మించింది. దీంతో పాటు అదనంగా రూ. 5 లక్షలతో రైల్వే ప్లాట్ ఫాం, టికెట్స్ ఇవ్వడానికి ఒక గదిని నిర్మించారు. గాంధీ పార్క్ రైల్వే స్టేషన్ ఏర్పాటు కావడంతో రైల్వే అధికారులు శక్కర్ నగర్ రైల్వే స్టేషన్‌ను మూసేశారు. దీంతో కొన్ని సంవత్సరాలు గాంధీ పార్క్ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపేవారు. టికెట్స్ సైతం ఇచ్చేవారు. బోధన్‌కు వచ్చే బోధన్-మిర్జాపల్లి, బోధన్-మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైళ్లు కరోనా కారణంగా రద్దు కావడంతో నాటి నుంచి ఈ స్టేషన్‌లో రైళ్లు నిలుపడం లేదు. దీంతో ప్రయాణికులు రాకాసీపేట్ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతున్నారు. బోధన్‌కు వచ్చే రాయలసీమ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్- కరీంనగర్, బోధన్- మహబూబ్‌నగర్ ప్యాసింజర్ రైలు ఈ స్టేషన్‌లో ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు స్పందించి బోధన్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే బోధన్-కరీంనగర్ ప్యాసింజర్ రైలు, పలు రైళ్లను గాంధీ పార్క్ రైల్వే స్టేషన్‌లో ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సోయా వ్యాపారుల సిండికేట్..!

- క్వింటాలుకు రూ. 700 తగ్గించిన వ్యాపారులు
- ఆందోళనలో రైతులు


ముప్కాల్ మండలం రెంజర్లలో రోడ్డుపై ఆరబోసిన సోయాలు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన పంటను దళారులు దోచుకెళ్తున్నారు. సోయా వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నట్టేట ముంచుతున్నారు. నాలుగు రోజుల క్రితం క్వింటాలుకు రూ. 4500 నుంచి రూ. 4700 వరకు కొనుగోలు చేశారు. రెండు రోజుల నుంచి ఒక్క సారిగా పరిస్థితిని మార్చేశారు. మార్కెట్‌లో ధర లేదంటు క్వింటాళులు రూ. 3800కు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు ఒక్క సారిగా ఆందోళన చెందారు. నాలుగు రోజుల వ్యవధిలో క్వింటాలుకు రూ. 700 తగ్గించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజన్ ప్రారంభంలో సోయాకు క్వింటాలుకు రూ. 4600 కొనుగోలు చేయడంతో మద్దతు ధర దక్కుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సోయా పంటకు ప్రభుత్వం రూ. 4600 మద్దతు ధరను ప్రకటించింది. రూ. 10 తక్కువ ధరకైనా రైతులు దళారులకే విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ధర అమాంతం పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం క్వింటాలుకు రూ. 5 వేలు పలికిన సోయా క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుత సంవత్సరం సోయా పంట సాగును కూడా రైతులు తగ్గించారు. అయినా ధర పతనం కావడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

దీనికి వ్యాపారులు సిండికేట్‌గా మారడమే అని పలువురు పేర్కొంటున్నారు. సోయా పంట సాగు ప్రారంభం నుంచి పంటకు వచ్చే పురుగు ఆశించి ఎక్కువగా ఖర్చులయ్యాయి. ముందుగా వర్షాలు కురిసి తరువాత కురువక రైతులు అపర భగీరథ ప్రయత్నాలు చేసి పంటలను సాగు చేశారు. కానీ చివరికి దళారుల చేతిలో చిక్కిపోతున్నారు. ప్రభుత్వం సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడాన్ని అవకాశంగా మలుచుకున్న వ్యాపారులు, దళారులు సోయా ధరను రోజు రోజుకి తగ్గిస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధర తగ్గించేశారు..



సోయా ధరను రెండు రోజుల్లో రూ. నాలుగు వందలు తగ్గించారు. క్వింటాలుకు రూ. 3900కు కొనుగోలు చేస్తున్నారు. సిండికేట్ వ్యాపారులపై తీరుపై ప్రభుత్వం స్పందించాలి. కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– బుయ్య నర్సన్న, రైతు

మరింత తగ్గుతుందని..



సోయా ధర మరింత తగ్గుతుందని వ్యాపారులు తెలుపుతున్నారు. దీంతో ఆందోళన పెరుగుతోంది. క్వింటాలుకు రూ. 5 వేలు ఉంటేనే పెట్టిన పెట్టుబడి వస్తుంది. కానీ రోజు రోజుకు ధర తగ్గడంతో రైతులకు నష్టమే కలుగుతుంది.

– రాజేందర్, రైతు

యువత సన్మార్గంలో నడవాలి


మాట్లాడుతున్న వక్త రాజేశ్వర్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: దేశాన్ని నడిపించే యువత సన్మార్గంలో నడవాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి ఘణపురం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలోని మేరుభవన్‌లో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శౌర్య జాగరణ యాత్ర ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఠాగూర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, జిల్లా సహకార్యదర్శులు ధాత్రిక రమేశ్, అరుణ్ రెడ్డి, బజరంగ్ దళ్ నగర సంయోజక్ సాయి, ప్రముక్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్‌పల్లి వాసికి డాక్టరేట్



సిరికొండ: మండలంలోని నర్సింగ్‌పల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కాయిత సాల్మన్ కూతురు స్పందన ఉస్మానియా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫి డాక్టరేట్ పొందారు. సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న స్పందన వ్యవసాయరంగంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశంపై పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన స్పందనను ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సీఎస్‌ఈ విభాగాధిపతి రమణ్ దుగ్యాల, అధ్యాపకులు అభినందించారు.

కన్నీటి సంద్రమైన కుమ్మన్‌పల్లి


బోధన్ నుంచి బైక్‌ర్యాలీగా వస్తున్న యువకులు

బోధన్: సిక్కిం వరదల్లో గల్లంతై మృతిచెందిన ఆర్మీజవాన్ గంగాప్రసాద్ అంతిమయాత్రలో భాగంగా ఆయన స్వగ్రామమైన కుమ్మన్‌పల్లి కన్నీటిసంద్రమైంది. వందల సంఖ్యలో రాజకీయ నాయకులు, ప్రజలు బైక్‌ర్యాలీగా ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్మీ జవాన్ సతీమణి శిరీష, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు కాశీరాం, సరూబాయిలను కలెక్టర్, సీపీలు ఓదార్చారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు.




ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ పార్థివ దేహానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, నివాళులర్పిస్తున్న సీపీ


అంతిమ యాత్రలో పాల్గొన్న జనం


రోదిస్తున్న జవాన్ సతీమణి శిరీష, పిల్లలు


జవాన్ మృతదేహంతో అంతిమయాత్ర..


తుపాకులు పేల్చి గౌరవ వందనం చేస్తున్న జవాన్లు

హైదరాబాద్ తరలిన ముదిరాజులు


భాగిర్తిపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ముదిరాజ్‌లు


బాన్సువాడ మండలం దామరంచ నుంచి..

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు జిల్లా నుంచి ముదిరాజ్ కులస్తులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కుల సంఘం నేతలు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులకు జనాభా ప్రకారం చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించడానికి పార్టీలు సీట్లు కేటాయించాలన్నారు. ఆత్మగౌరవ సభలో తమ డిమాండ్లను రాష్ట్ర కమిటీ ప్రకటిస్తుందన్నారు. తమకు రాజకీయంగా పెద్ద పీట వేసేవారికే తాము ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు.


సదాశివనగర్ నుంచి ..


ఎల్లారెడ్డి నుంచి..

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1997–98 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, అమరనాథ్, శివశంకర, విఠల్‌రెడ్డి, మైసాగౌడ్, సంజీవరెడ్డి, రమేశ్, గణేశ్, రాజమౌళి, శేఖర్, రాంకిశోర్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, శంకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకట్‌స్వామి, శ్రీనివాస్, పెంటయ్య, నర్సింలు, సంతోష్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం కాంగ్రెస్‌లో.. సాయంత్రం బీఆర్‌ఎస్‌లో..


ఉదయం కాంగ్రెస్ పార్టీ కండువా


సాయంత్రం బీఆర్‌ఎస్ కండువా

మాచారెడ్డి: చంద్రునాయక్ తండాకు చెందిన పలువురు యువకులు ఆదివారం ఉదయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారే తిరిగి సాయంత్రం ఎంపీపీ నర్సింగరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ యువకులు మాట్లాడుతూ డీజే ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారన్నారు. కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున అభివృద్ధిని కాంక్షించి బీఆర్‌ఎస్‌లో చేరామని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి


బరంగెడ్గిలో గదులను ప్రారంభిస్తున్న స్పీకర్

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బరంగెడ్గిలో పలు అభివృద్ధి పనులను స్పీకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనుషులు శాశ్వతం కాదు.. ప్రజా సమస్యలను గుర్తించి చేపట్టిన పనులు మాత్రం ఎప్పటికీ శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. సీఎం సూచన మేరకు రానున్న ఎన్నికల్లో తానే మరోసారి బాన్సువాడ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. పండ్లు ఇచ్చే చెట్టును ప్రజలు కాపాడుకోవాలని, మంచి మనస్సుతో తనను ఆశీర్వదించాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గంలో రూ.200కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్, మంజీరా నదిలో 4 చోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తిలకేశ్వర్ రఘు, జెడ్పీటీసీ స్వరూప, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, కుమ్మరి గంగామణి, రాములు తదితరులు పాల్గొన్నారు.


మిర్జాపూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కేసీఆర్ పాలనలోనే సంక్షేమ పథకాలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): సీఎం కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిర్జాపూర్, వీరాపూర్‌లో రూ. 1.51 కోట్లతో చేపట్టిన జీపీ, పల్లె దవాఖాన, అంగన్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో అభివృద్ధి కాలేదని తెలంగాణ వచ్చాక పరిస్థితులు మారాయని తెలంగాణ దేశంలోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఎదుగుతోందని అన్నారు. మిర్జాపూర్ గ్రామంలోనే రూ.35కోట్లు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పురం లక్ష్మి, సాయిరాం, ఎంపీపీ పాల్త్య విఠల్, రఘు, జెడ్పీటీసీ స్వరూప, పార్టీ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీశ్, నాయకులు మారుతి, శ్రీనివాస్, పురం వెంకటి, సందీప్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అమృతాపూర్‌లో మహిళ ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ ఒడ్డెర కాలనీకి చెందిన సంవంగి లింగవ్వ (56) బావిలో పడి ఆత్మహత్య చేసుకుందని ఎస్సై మహేశ్ ఆదివారం తెలిపారు. లింగవ్వ కొద్దిరోజులుగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధపడుతోంది. ఆదివారం ఉదయం స్థానిక బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం




కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులు

నిజాంసాగర్(జుక్కల్)/ వేల్పూర్ : నిజాంసాగర్, వేల్పూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కల స్వైర విహారంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కల దాడుల్లో చిన్నారులు గాయాలకు గురవుతున్నారు. మహమ్మద్‌నగర్, నర్వ గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేయడంతో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేయడంతో పాటు రోడ్లపై ఉన్న పశువులపై దాడి చేస్తున్నాయి. వేల్పూర్ మండలం పడగల్ గ్రామంలో శనివారం కుక్కదాడిలో రాజారపు శ్రేయాస్ (5) అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. శ్రేయస్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క ఆకస్మికంగా దాడిచేసి తలపై తీవ్రంగా గాయపర్చిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో రోడ్లపై నడవాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పిచ్చికుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

- భార్య, కుమార్తెపై అనుమానం


ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రంగాచారినగర్ కాలనీలో పాపయ్య(45) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సురేశ్‌బాబు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాపయ్య నిత్యం మద్యం డబ్బుల కోసం భార్య, కుమార్తెలను వేధించేవాడు. దీంతో విసిగిపోయిన వారు పాపయ్య నిద్రిస్తున్న సమయంలో శనివారం అర్ధరాత్రి దాడి చేసి హత్య చేశారు. హత్యను ప్రమాదశాత్తు మృతిగా చిత్రీకరించారు. ఉదయం కాలనీలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో ఆధారాలు సేకరించేందుకు జిల్లా కేంద్రం నుంచి జాగిలాన్ని రప్పించారు. జాగిలం మృతుని కుమార్తె వద్ద నిలిచిపోయింది. దీంతో మృతుడి భార్య, కూతురిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తమ్ముడు చిన్నారెడ్డి ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


నాగరాజు (ఫైల్)

బాల్కొండ: ఆగిఉన్న డీసీఎంను పాలవ్యాన్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘట న మండల కేంద్రంలోని లింగమయ్య ఆలయ శివా రులో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ మండలం పెర్కిట్‌కు చెందిన పాల వ్యాపారి, వ్యాన్‌డ్రైవర్ కొత్త నాగరాజు(32) ప్రతి రోజు బాల్కొండ మండల పరిధిలోని దుకాణాల్లో పాల ప్యాకెట్లను వ్యాన్‌లో సరఫరా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం బాల్కొండ శివారులోని జాతీయ రహదారిపై ఆగిఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహం